సాక్షి
హనుమకొండ

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



శిశువును అపహరించిన మహిళ అరెస్ట్

వరంగల్ సీకేఎం ఆస్పత్రిలో మగశిశువును అపహరించిన మహిళను పోలీసులు ఆదిలాబాద్‌లో అరెస్ట్ చేశారు. - 8లో▸



వివాదాస్పదం - 8లో▸

ఆర్టీసీలో ఉద్యోగులను పరీక్షిస్తున్న బ్రీత్ అనలైజర్ తప్పుగా చూపిస్తుండడం వివాదాస్పదమవుతోంది. మద్యం తాగకున్నా తాగినట్లు చూపిస్తుండడంతో నిరసన తెలుపుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం $30^0/23^0$

జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

త్రిముఖ గణపతిగా పూజలు



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయంలో జరుగుతున్న శ్రీఉత్తిష్టగణపతినవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం మూలమహాగణపతిని త్రిముఖ గణపతిగా అలంకరించి పూలమాలలు వేసి దూర్వాపత్రాలతో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు ఉపేంద్రశర్మ, వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం 5గంటల నుంచి శ్రీరుద్రేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం జరిపారు. ఉత్సవమూర్తికి పల్లకిసేవ నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్ : హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ ఆపైన చదువుతున్న దివ్యాంగులకు 2024–25 విద్యా సంవత్సరానికిగాను పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమాధికారి రాజమణి సోమవారం తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐటీఐలో అప్రెంటిస్ మేళా

కాజీపేట : ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికను ఐటీఐ అభ్యర్థులు ఉద్యోగాల కోసం సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ రీజియన్ అధికారి సీతారాములు తెలిపారు. కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఇటీవల ఐటీఐ పూర్తి చేసిన 80 మంది విద్యార్థులు అప్రెంటిస్ మేళాకు హాజరుకాగా 54 మంది ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు, చందర్, సక్రు, కంపెనీ ప్రతినిధులు వెంకటేష్, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అథ్లెట్ దీప్తికి అభినందన



వరంగల్ స్పోర్ట్స్ : పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో 400 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకం సాధించిన అథ్లెట్ జీవాంజి దీప్తిని హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్ సోమవారం అభినందించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) అకాడమీలో దీప్తిని కలిసి అభినందనలు తెలిపారు. డీవైఎస్‌ఓ వెంట తెలంగాణ రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ కరీం ఉన్నారు.

కేడీసీలో అతిథి అధ్యాపకుల నియామకం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీబీఏ ఆర్ట్ –1, బీసీఏ కంప్యూటర్స్ –1, ఎలక్ట్రానిక్స్ –1, గణితం –1, మైక్రోబయాలజీ –1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిలో అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. యూజీసీ నిబంధనల మేరకు పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులు, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు కేడీసీలో దరఖాస్తు చేసుకోవాలని, 12న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి



వరంగల్ లీగల్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న(శనివారం) లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ బి.వి నిర్మలా గీతాంబ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో సోమవారం ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్, బ్యాంకు అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో గీతాంబ పాల్గొని మాట్లాడారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, వివాహ/కుటుంబ, మోటార్ వెహికల్ యాక్ట్, బ్యాంకు, చిట్‌ఫండ్, ఎక్సైజ్, ఇతర కేసులు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్, హనుమకొండ బార్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.రమేష్, చిట్‌ఫండ్ మేనేజర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.


సెల్‌కిల్ డ్రైవింగ్..!

ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరం

- కమిషనర్ పరిధిలో జరిమానాలు విధించినా మారని వైనం
- ఈ ఏడాది సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు 5,675
- బ్లూటూత్ అయినా తప్పని శిక్ష

వరంగల్ క్రైం:

చేతి భుజం, తలమధ్యలో సెల్‌ఫోన్ పెట్టుకుంటూ వాహనం నడపడం.. బ్లూటూత్‌లో మాట్లాడుతూ వెనుక హారన్ కొట్టినా పట్టించుకోకుండా అడ్డదిడ్డంగా పోవడం వాహనదారులకు అలవాటైపోయింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని పోలీసులు నెత్తినోరు మొత్తుకుంటున్నా.. ఎడాపెడా కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు మారడం లేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం సెల్‌ఫోన్ డ్రైవింగ్ అని తెలిసింది. దీంతో ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడాన్ని పోలీస్ అధికారులు డేంజర్ డ్రైవింగ్‌గా పరిగణిస్తున్నారు.



జరిమానాలు విధించినా..



ముఖ్యంగా గ్రేటర్ వరంగల్ పరిధిలో అడుగడుగునా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఫోన్‌లో మాట్లాడుతూ వారి కంట పడితే జరిమానాలు విధిస్తున్నారు.

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటానికి హెల్మెట్ పక్కన పెట్టాలి.
- ఈ క్రమంలో డ్రైవింగ్ అదుపుతప్పి ప్రమాదాలకు కారణమవుతుంది.
- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల మెడనొప్పితో పాటు వెన్నెముక నొప్పి వస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు.
- ఏదైనా అర్జంట్ మాట్లాడాల్సి వస్తే వాహనం పక్కకు ఆపి మాట్లాడి ఆ తరువాత వెళ్లాలి.
- సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.1,000, దీంతోపాటు హెల్మెట్ వాడనందుకు రూ.135 జరిమానా.


బాధ్యతారాహిత్యమే..



వాహనదారుల్లో చాలామంది బాధ్యతారాహిత్యంగా ఉంటున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. కొందరు బ్లూటూత్ వాడుతూ వాహనాలు నడుపుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. మీ వల్ల ఇతర వాహనదారులు చిక్కుల్లో పడతారు. మరీ అర్జంట్ అయితే వాహనం పక్కన ఆపి మాట్లాడి వెళ్లొచ్చు. అంతేగానీ ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు.

- సత్యనారాయణ, ట్రాఫిక్ ఏసీపీ, వరంగల్ పోలీస్ కమిషనరేట్

అనర్హత.. తప్పదా..?



ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవికి పొంచి ఉన్న ముప్పు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత.. నాలుగు వారాల గడువు
- చర్చనీయాంశంగా మారిన హైకోర్టు తీర్పు
- స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నిక అనివార్యమేనా..?
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వర్గాల్లో ఉత్కంఠ

సాక్షిప్రతినిధి, వరంగల్ :

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పదవికి అనర్హత ముప్పు పొంచి ఉందా..? ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక తప్పదా.. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలపై తెలంగాణ హైకోర్టు సోమవారం ఇచ్చిన తీర్పుతో ఉమ్మడి జిల్లాలో ఇదే చర్చ నడుస్తోంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ధర్మాసనం స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోకపోతే.. సుమోటోగా కేసు స్వీకరించి మళ్లీ విచారణ ప్రారంభిస్తామని తీర్పులో హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు బీఆర్‌ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనుచరవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది.

అంతటా 'అనర్హత'పైనే చర్చ..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌లో గెలిచిన దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలని కోరుతూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానందగౌడ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా మరో పిటిషన్ వేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పాటు పలు రాష్ట్రాల్లోని న్యాయస్థానాల తీర్పులను, ఫిరాయింపు చట్టం నిబంధనలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. చివరకు పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని సోమవారం హైకోర్టు ఆదేశించించడం కలకలం రేపింది. దీంతో స్టేషన్ ఘన్‌పూర్ టికెట్ పొందడం మొదలు గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరడం... తాజాగా హైకోర్టు తీర్పు వెలువడే వరకు పలుమార్లు కడియం శ్రీహరి పతాక శీర్షికలకెక్కారు. హైకోర్టు తీర్పు మేరకు కడియం శ్రీహరిపై అనర్హత వేటు పడే అవకాశమే ఎక్కువుందన్న చర్చ ఒక పక్కన.. స్పీకర్ కార్యాలయం ఏం నిర్ణయం తీసుకుంటుందోనన్న చర్చ మరో పక్కన జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోకవర్గానికి ఉప ఎన్నిక తప్పదా? అన్న ఉత్కంఠ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల్లో నెలకొంది.

విమర్శలు, ప్రతి విమర్శలు..
ఎవరి ధీమా వారిదే...

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై అనర్హత వేటుకు సంబంధించిన అంశంపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు స్పందించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, డా.టి.రాజయ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిలు ఎవరికీ వారుగా తమ అభిప్రాయాలను మీడియాతో పంచుకున్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు.

వెంటనే చర్య తీసుకోవాలి..

బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే అనర్హత వేటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న. నాలుగు వారాల్లో ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు స్పీకర్ అనర్హత వేటు వేయాలి.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ మంత్రి

డివిజన్ బెంచ్ అప్పీలుకు వెళ్తాం

నాకు కోర్టుపైన నమ్మకం వుంది.. డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్తాం. పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. సంబరాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలే పార్టీ ఫిరాయింపులకు మూల కారకులు. 2014 నుంచి 2023 మధ్యకాలంలో పెద్ద ఎత్తున ఫిరాయింపులకు పాల్పడిన చరిత్ర బీఆర్‌ఎస్‌ది.

- కడియం శ్రీహరి, ఎమ్మెల్యే

నిబద్ధత ఉంటే శ్రీహరి రాజీనామా చేసి గెలవాలి..

బీఆర్‌ఎస్ కార్యకర్తల కష్టంతో గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి నిబద్ధత ఉంటే రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై గెలవాలి. పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. రాజకీయ పార్టీలకు అతీతంగా, రాజ్యాంగబద్ధంగా స్పీకర్ వ్యవహరించాలి. కడియం శ్రీహరి, కావ్యలు నియోజకవర్గానికి ఎంత చేసిన తక్కువే. నియోజకవర్గ ప్రజలకు వారు రుణపడి ఉండాలి.

- డా.టి.రాజయ్య, మాజీ మంత్రి

కాళోజీకి పుష్పాంజలి



కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కడియం కావ్య, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ : కాళోజీ జయంతి సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ కడియం కావ్య, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కవులు, రచయితలు, కళాకారులు, పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. కాళోజీ తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ కాళోజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కాళోజీ కవితలు సగటు మనిషిని సైతం అన్యాయంపై పోరాడేలా చేస్తాయన్నారు.కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ అడిషనల్ కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ జెడ్పీ సీఈఓ విద్యాలత, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ, రచయితలు అంపశయ్య నవీన్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, కవులు, కళాకారులు, రచయితలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నయీంనగర్ బ్రిడ్జిపై రాకపోకలు షురూ..

హనుమకొండలోని నయీంనగర్ బ్రిడ్జిపై సోమవారంనుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 5న బ్రిడ్జిని కూలగొట్టారు. మూడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పినా పనుల్లో జాప్యంతో ఐదు నెలలు పట్టింది. 157 రోజుల తరువాత బ్రిడ్జిపైనుంచి రాకపోకలు మొదలయ్యాయి. బ్రిడ్జి బంద్ కావడంతో ట్రాఫిక్ మళ్లింపు వల్ల పలు జంక్షన్లలో ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బ్రిడ్జి ప్రారంభంతో దూరభారం తగ్గడంతోపాటు ట్రాఫిక్‌జామ్‌లు కొంత మేర తగ్గనున్నాయి.

- నయీంనగర్

నగరాభివృద్ధికి రూ.4,500కోట్లు కేటాయించండి

16వ ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొన్న మేయర్, కమిషనర్



హైదరాబాద్‌లో జరిగిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : వరంగల్ మహానగర అభివృద్ధికి రూ.4,500కోట్ల నిధులు కేటాయించాలని మేయర్ గుండు సుధారాణి కేంద్ర 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశంలో మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు పాల్గొని నగర అభివృద్ధి ప్రతిపాదనలపై నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. తెలంగాణలో రెండో అతిపెద్ద నగరం వరంగల్ అని, కీలకమైన విద్య, పారిశ్రామిక కేంద్రంగా మారిందని, వేగవంతమైన అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. వరంగల్‌లో ప్రస్తుతం పూర్తిస్థాయిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ లేనందున ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలకు సంవత్సరానికి కనీసం రూ.1,000 కోట్ల చొప్పున నిధులు ఇవ్వాలని విన్నవించారు. ప్రతీరోజూ వెలువడే 450 టన్నుల చెత్త, 4 లక్షల టన్నుల లెగసీ వ్యర్థాల నిర్వహణకు బయో–మైనింగ్ ప్లాంట్లు స్థాపించడానికి రూ.100 కోట్లు అవసరమని కోరారు. జియోగ్రాఫికల్ అథంటిఫికేషన్ సిస్టం (జీఐఎస్) ఏర్పాటుకు రూ.100 కోట్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్వహణకు 100 కోట్ల రూపాయలు కేటాయించాలని పేర్కొన్నారు. 42 కొత్త గ్రామాల విలీనంతో, పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు, పౌర సేవలకు తలసరి గ్రాంట్ అవసరమని మేయర్ తెలిపారు. వనమహోత్సవ కార్యక్రమ నిర్వహణకు గ్రీన్‌బడ్జెట్, పెరుగుతున్న విద్యుత్ చార్జీల ఖర్చులను కవర్ చేయడానికి 16వ ఆర్థిక సంఘం గ్రాంట్ల టైడ్ కాంపోనెంట్‌ను పెంచాలని మేయర్ కోరారు. ఆర్థిక సంఘం మద్దతుతో, నగరాన్ని మరింత ఆధునికంగా, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రంగా మారుస్తామని పేర్కొన్నారు. అంతకుముందు 16వ ఆర్థిక కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద్ పణగారియాకు నివేదిక అందజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, సీడీఎంఏ వీపీ గౌతమ్ తదితరులు ఉన్నారు.

ఇంటింటా బీజేపీ సభ్యత్వం ఉండాలి

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న నర్సయ్యగౌడ్

వరంగల్ చౌరస్తా : ఇంటింటా బీజేపీ సభ్యత్వం తీసుకునే విధంగా చైతన్యం కల్పించాలని మాజీ ఎంపీ, పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్ సూచించారు. సోమవారం వరంగల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ జాతీయ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత విస్తరించేలా కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యత్వ సహ ప్రముఖ్ మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, సభ్యత్వ జిల్లా ఇన్‌చార్జ్ పాపారావు, సహ ఇన్‌చార్జ్ పాపన్న, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, అరూరి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

పీఆర్‌ఏపై అవగాహన

విలేజ్ మ్యాప్‌తో వివరించిన విద్యార్థులు



మ్యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : ఎస్‌ఆర్ యూనివర్సిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ అవగాహన కృషి, అనుభవంలో భాగంగా సోమవారం మండలంలోని గూడూరులో పార్టిసిపెటరీ రూరల్ అప్రైజల్ (పీఆర్‌ఏ) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు విలేజ్ మ్యాప్‌తో స్థానిక చెరువులు, కుంటలు, నీటి వనరులు, వ్యవసాయ భూములకు సంబంధించి వివరాలను రైతులకు వివరించారు. పీఆర్‌ఏ ఒక ప్రాథమిక ఉపయోగం, సేవ రూపకల్పన, జవాబుదారీ తనం, న్యాయవాద అభ్యాస కార్యక్రమాల వికేంద్రీకరణ, సాధికారత సూత్రాలను కలిగి ఉంటుందన్నారు. కళాశాల డీన్ డాక్టర్ గోపాల్‌రాజు, పీఆర్‌ఏ ఆర్‌ఏడబ్ల్యూఈపీ కో ఆర్డినేటర్ శ్రీకర్, విలేజ్ కో ఆర్డినేటర్ రాథోడ్‌లాల్, విద్యార్థులు శ్రావ్య, దివ్య, శ్యామ్, ఏఈఓ ప్రశాంత్, మాజీ సర్పంచ్ సాంబయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి నిర్లక్ష్యం..!

గుర్రపు డెక్కలోనే.. గణనాథుల నిమజ్జనమా?

- బల్దియా ఇంజనీర్ల తీరుపై విమర్శలు
- అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు



ఉర్సు రంగసముద్రంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

వరంగల్ అర్బన్ : రేపటినుంచే గణనాథుల నిమజ్జనం ప్రారంభమవుతుంది. మహానగరంలోని చెరువుల్లో కనీస ఏర్పాట్లు సైతం కానరావడం లేదు. ప్రతి ఏటా బల్దియా ఇంజనీర్లు ఆగమాగం, హడావుడిగా పనులు చేపట్టడం, నిధులను దుర్వినియోగం చేయడం పరిపాటిగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.

అవే చెరువులు.. ఏర్పాట్లు అక్కడే..

వరంగల్‌లోని ఉర్సు రంగసముద్రం, చిన్నవడ్డెపల్లి చెరువు, కోట చెరువు, కట్టమల్లన్న చెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, ఖిలా వరంగల్ అగర్తలా, హనుమకొండ పద్మాక్షి గుండం, బంధం చెరువు, మడికొండతోపాటు మరో 11 చెరువుల్లో భక్తులు గణేశ్ నిమజ్జనాలు చేస్తుంటారు. అయితే ప్రతి ఏటా వినాయకుల నిమజ్జనానికి రూ.కోటి వరకు బల్దియా వెచ్చిస్తోంది. కానీ ఇంత వరకు అభివృద్ధి పనులు మొదలు పెట్టకపోవడంతో బల్దియా అధికారుల తీరుపై అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏడాది పాటు పండుగల సీజన్ కోసం లైట్లు, సీసీ కెమెరాలు, టెంట్లు, రోడ్ల మరమ్మతులు ఇతర 139 పనులపై టెండర్లు పిలిచారు. కాగా కొందరు కాంట్రాక్టర్లు ముందుకు రాగా, వాటిని రద్దు చేసి, మళ్లీ టెండర్లు వేయాలని ఇంజనీర్లు కొత్త నిబంధనల పెట్టారు. దీంతో గణేశ్ నిమజ్జనం ముందు హడావుడిగా టెండర్లు పిలిచి వాటిని రద్దు చేయడం పట్ల కాంట్రాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ టెండర్ల రద్దుతో ఒక్కొక్కరు రూ.3 వేల నుంచి రూ.10వేల వరకు నష్టపోయినట్లు చెబుతున్నారు. పండుగల పేరుతో ప్రజల సొమ్మే కాదా అంటూ కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు స్వాహా చేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

గుర్రపు డెక్క తొలగించరా?

నగరంలోని చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయింది. గణేశ్ నిమజ్జనం చేసేందుకు కనీసం నీటి జాడ కనిపించని పరిస్థితి ఉంది. గుర్రెపు డెక్క మధ్యలో గణేశ్ నిమజ్జనం చేసేందుకు భక్తులు, నిర్వాహకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జనం నాటికి గుర్రెపు డెక్క తొలగించకపోవడం పట్ల ఇంజనీర్ల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బల్దియా పాలక వర్గం, కమిషనర్, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు గణేశ్ నిమజ్జన ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించడం పట్ల అనేక ఆరోపణలున్నాయి.

క్లుప్తంగా

కళాక్షేత్రం అద్భుతంగా ఉంది..

- కాళోజీ కళాక్షేత్రాన్ని సందర్శించిన కాళోజీ మనువడు సంతోష్



హన్మకొండ కల్చరల్ : తాతగారి పేరుమీద నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం అద్భుతంగా ఉందని కాళోజీ మనువడు సంతోష్ అన్నారు. సోమవారం కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కళాక్షేత్రం ప్రారంభమవుతుందని తెలిసి.. అమెరికాలో నివాసం ఉంటున్న తాను భార్య ప్రియాంకతో కలిసి కళాక్షేత్రాన్ని సందర్శించినట్లు తెలిపారు. సంతోష్‌తో సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రముఖ వైద్యులు వీఎస్ రెడ్డి, కవులు పొట్లపల్లి శ్రీనివాసరావు, వీఆర్ విద్యార్థి ఉన్నారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్య



స్వాతి(ఫైల్)

వరంగల్: వరంగల్ మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన రావిరాకుల స్వాతి.. అత్తింటి వేధింపులు భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వాతికి అదే గ్రామానికి చెందిన రావిరాకుల నిరంజన్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. ఈక్రమంలో భర్త, అత్త.. అధిక కట్నం కోసం స్వాతి వేధింపులకు గురిచేసేవారు. పెద్దమనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీ నిర్వహించినా భర్త నిరంజన్ వేధించడం మానకపోవడంతో ఈనెల 5వ తేదీ సాయంత్రం స్వాతి గడ్డి మందు తాగి తన తల్లికి చెప్పింది. వారు చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ స్వాతి సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తల్లి తలకోట్ల యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాఘవేందర్ తెలిపారు.

వివాదాస్పదం

తప్పుడు రీడింగ్ చూపుతున్న బ్రీత్ అనలైజర్

- ఆర్టీసీ వరంగల్–2 డిపోలో నిత్యకృత్యంగా మారిన వైనం
- సోమవారం ఇద్దరు డ్రైవర్లకు అధిక రీడింగ్
- పోలీసు స్టేషన్‌లో చెక్‌చేస్తే జీరో..
- ఉద్యోగుల నుంచి తీవ్ర నిరసన



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో బ్రీత్ అనలైజర్ టెస్టులు వివాదస్పదమవుతున్నాయి. ప్రధానంగా వరంగల్–2 డిపోలో వారానికి ఒకసారి బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో వస్తున్న తప్పుడు రీడింగ్‌తో ఉద్యోగులనుంచి ఓ వైపు నిరసనతోపాటు, మరో వైపు ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం అలవాటు లేనివారికి ఎక్కువ రీడింగ్ చూపించడంతో బ్రీత్ అనలైజర్ టెస్టులపై ఉద్యోగులు మండిపడుతున్నారు. సోమవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–2 డిపోలో మద్యం సేవించని ఇద్దరు డ్రైవర్లకు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా నిర్ణీత మోతాదును మించి రీడింగ్ వచ్చింది. ఎం.రాజుకు 66, సాంబరాజుకు 44 రీడింగ్ వచ్చింది. వీరు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి పరీక్షించుకోగా ఇద్దరికీ జీరో వచ్చింది. సాధారణంగా 20లోపు రీడింగ్ ఉంటే పరిగణలోకి తీసుకోరు. 20 దాటిన వారిపై యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. అంతకు ముందు ఈ నెల 1న కూడా ఇద్దరు డ్రైవర్లు ఎండీ యాకూబ్, నరేందర్‌కు ఇదే మాదిరిగా అధిక రీడింగ్ రావడంతో ఆ రోజు ఆర్టీసీ ఉద్యోగులు వరంగల్–2 డిపోలో గేట్ ధర్నాలు చేశారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లి పరీక్షించగా జీరో రీడింగ్ వచ్చింది. అంతకు ముందు మరో డ్రైవర్‌కు ఇదే విధంగా అధిక రీడింగ్ రాగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా జీరో వచ్చింది. అయినా తప్పుడు రీడింగ్ చూపిస్తున్న బ్రీత్ అనలైజర్ విషయంలో ఆర్టీసీ డిపో, రీజినల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మరోసారి వివాదస్పదమైంది. గతంలో పరకాల డిపోలో మద్యం అలవాటులేని డ్రైవర్‌కు పరీక్షించగా 200 రీడింగ్ వచ్చింది. వెంటనే ఉద్యోగులు ఆందోళనకు దిగి బస్సులు నిలిపివేశారు. అప్పటి పరకాల డిపో మేనేజర్ తాను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించుకోగా డ్రైవర్ రీడింగ్ కంటే అధికంగా వచ్చింది. దీంతో అప్పుడు డిపో మేనేజర్ ఆ డ్రైవర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పుడు వరంగల్–2 డిపోలో అదే పరిస్థితి తలెత్తె అవకాశముంది. తరచూ అధిక రీడింగ్ చూపిస్తూ ఉద్యోగాలు ఊడకొడుతుండడంతో డ్రైవర్లతోపాటు, మద్దతుగా కండక్టర్లు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో అధిక రీడింగ్ వచ్చిన వారిని సస్పెండ్, రిమూవల్ చేస్తుండడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. చిన్ననాటి నుంచి మద్యం అలవాటు లేని వారికి సైతం మద్యం సేవించినట్లు రీడింగ్ చూపిస్తూ జీవితాలతో చెలగాటమాడుతున్న బ్రీత్ అనలైజర్లను మార్చాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ముందుందు ఇలాంటి పరిస్థితులు పునరావృతమైతే బస్సులు నిలిపివేసి ఆందోళనకు దిగేందుకు డ్రైవర్లు, కండక్టర్లు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కాగా, రైల్వేలో ఒక బ్రీత్ అనలైజర్‌లో తప్పుడు రీడింగ్ వస్తే, ఆ ఉద్యోగి కోరిక మేరకు మరో బ్రీత్ అనలైజర్‌తో పరీక్షిస్తారని, ఇక్కడ కూడా మద్యం సేవించలేదని స్పష్టమైన హామీతో తనను మెడికల్ టెస్ట్‌కు పంపించాలని కోరితే పంపిస్తారని, ఆర్టీసీలోనూ ఈ విధానాన్ని అమలు చేయాలని ఆర్టీసీ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ సంస్థ నిబంధనలు, ఆదేశాల మేరకు నడుచుకుంటామని, స్వంతంగా నిర్ణయాలు తీసుకోలేమని చెప్పడం కొసమెరుపు.



వరంగల్–2 డిపోలో తప్పుడు రీడింగ్ చూపించే బ్రీత్ అనలైజర్

కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శం

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: ప్రజా హక్కుల కోసం పరితపించి పోరాడడమే తన ఊపిరిగా భావించిన కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి వరుణ్ రెడ్డి, ఇన్‌చార్జ్ డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన గొప్పవ్యక్తి కాళోజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతిరెడ్డి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు కె.తిరుమల్ రావు, రాజుచౌహాన్, కె.కిషన్, రవీంద్రనాథ్, అశోక్, బీకంసింగ్, జీ.ఎంలు మాధవరావు, మల్లికార్జున్, దేవేందర్, నాగప్రసాద్, వేణుబాబు, అన్నపూర్ణ, కంపెనీ సెక్రటరీ వెంకటేశం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న వరుణ్ రెడ్డి

రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఖాయం

- మూడు చోట్ల బీఆర్ఎస్ గెలవబోతోంది
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడనున్న నేపథ్యంలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి.. మూడు నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురబోతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధుల మంజూరు విషయమై సోమవారం కలెక్టర్ రిజ్వాన్ బాషాను కలిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోర్టును ఆశ్రయించగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ న్యాయమూర్తులు స్పీకర్‌కు ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. గడువులోపు ఆ ముగ్గురు ఎమ్మెల్యేలపై చర్య తీసుకోని పక్షంలో తామే తీసుకుంటామని కోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. కొద్ది రోజుల్లో తెలంగాణలో మూడుచోట్ల ఉప ఎన్నికలు రానున్నాయని, బీఆర్ఎస్ విజయం ఖాయమని అన్నారు. కోర్టు తీర్పును గౌరవించి ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయార్‌రావు

భద్రకాళి దేవస్థానంలో పట్టుచీర పంచాయితీ

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు... చీర ఇస్తామనడంతో వెనక్కి తీసుకున్న భక్తురాలు

రామన్నపేట : వరంగల్ భద్రకాళి దేవస్థానంలో అమ్మవారికి సమర్పించిన ఓ పట్టుచీర పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తిరిగి చీర ఇస్తామని ఆలయ సిబ్బంది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి. భక్తురాలు రమ.. తన స్నేహితురాలితో కలిసి ఆగస్టు ఒకటిన రూ.10వేల విలువగల పట్టుచీరను భద్రకాళి అమ్మవారికి కట్టించేందుకు దేవస్థానంలో అప్పగించింది. చీరను పెళ్లి కోసం కొన్నామని, అమ్మవారికి కట్టించిన అనంతరం తిరిగి తీసుకెళ్తామని సిబ్బందికి చెప్పింది. అమ్మవారికి చీర కట్టిన సిబ్బంది ఆగస్టు 3వ తేదీన రమకు వాట్సాప్ ద్వారా ఫొటో కూడా పంపించారు. తర్వాత రోజున రమ వాళ్ల బంధువులు మరణించడంతో దేవస్థానానికి రాలేదు. మూడు రోజుల క్రితం దేవస్థానానికి వెళ్లిన రమకు.. చీర పోయిందని సిబ్బంది సమాధానమిచ్చారు. దీనిపై ఇరువురి మధ్య కొంత వివాదం నడిచింది. రమ పోలీస్‌కానిస్టేబుల్ కావడంతో మట్టెవాడ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా.. ఈఓ శేషుభారతి స్పందించారు. భక్తురాలి చీర పోలేదని, టెండర్ ప్రక్రియలో పాల్గొన్న వ్యక్తి విక్రయించారని, భక్తురాలికి తిరిగి చీర ఇస్తామని పేర్కొన్నారు. ఈఓ వివరణతో రమ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకుంది.

అడవి విధ్వంసంపై శాస్త్రీయ అధ్యయనం



అడవిని పరిశీలిస్తున్న బృందం

ధర్మసాగర్: మేడారం, తాడ్వాయి ప్రాంతంలో అడవి విధ్వంసం గురించి జన విజ్ఞాన వే దిక, పర్యావరణ సబ్ కమిటీ బృందం శాస్త్రీయ నిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు సబ్ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడారం దారిగుండా కొండేటి వాగు నుంచి కొండపర్తి వరకు ఆగస్టు 31న సాయంత్రం దట్టమైన మేఘాలతోపాటు గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో వీచిన సమాంతర ఉధృత గాలుల వల్ల సుమారు 100 నుంచి 150 హెక్టార్లలో 60 వేలకు పైగా వృక్షాలు నేలకొరిగాయని తెలిపారు. గాలి వాన దాటికి చెట్లు కూకటి వేళ్లతో నేలకొరిగాయని పేర్కొన్నారు. సన్నగా ఉన్న చెట్లు సగానికి విరిగి తెగిపడ్డాయని 100 సెంటీమీటర్ల చుట్టుకొలత గల పెద్ద వృక్షాలు మాత్రం బరువు ఎక్కువై నేలకొరిగాయనేది శాస్త్రీయ అంచనా అని పేర్కొన్నా రు. ఈ ప్రాంతమంతా ఇసుక నేలలు కావ డం, నాలుగు అడుగుల కింద రాతి గుండ్లు ఉండడంతో వేరు వ్యవస్థ సమాంతరంగా వ్యాపించిందని, తల్లి వేరు కొద్దిలోతు వరకే పెరగడం మరో కారణమని తెలిపారు. అడవిని పరిశీలించిన వారిలో పురుషోత్తం, ధర్మప్రకాశ్, శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, సాజిద్ ఉన్నారు.

ఫిరాయింపులపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎంపీ వినోద్ కుమార్

హన్మకొండ: పార్టీ ఫిరాయింపులు, పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా నడుచుకునే ఎంపీలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు కనీస కాలవ్యవధి నాలుగు వారాలుగా నిర్ణయిస్తూ రాజ్యాంగంలోని 6వ షెడ్యూల్‌లో సవరణ చేయాలని మాజీ ఎంపీ, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీవ్‌గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ఫిరాయింపుల చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో పార్టీ వ్యతిరేక చర్యలు, ఫిరాయింపులకు పాల్పడిన ఎంపీలు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేందుకు నిర్ణీత కాలవ్యవధి లేకపోవడంతో స్పీకర్లు జాప్యం చేయడానికి అవకాశముందన్నారు. ఫిరాయింపుల చట్టానికి సంబంధించిన 6వ షెడ్యూల్‌లో చర్యలకు నిర్ణీత కాలవ్యవధి చేర్చాలనే అంశాన్ని ప్రధాని మోదీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిర్ణీత కాలవ్యవధి నిర్ణయిస్తూ సవరణకు చొరవ తీసుకోవాలన్నారు. లేకపోతే ప్రజాప్రతినిధులపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావులపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని, ఆ లోపు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే తామే సుమోటగా విచారణకు స్వీకరిస్తామని హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అసెంబ్లీ స్పీకర్ కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు విని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కోర్టుతో చీవాట్లు తినొద్దన్నారు.



మాట్లాడుతున్న బోయినిపల్లి వినోద్ కుమార్

జేసీఎల్‌గా రాజేంద్రప్రసాద్ బాధ్యతల స్వీకరణ

హన్మకొండ చౌరస్తా : వరంగల్ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జేసీఎల్)గా రాజేంద్రప్రసాద్ సో మవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన సునీత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. రాజేంద్రప్రసాద్‌ను హనుమకొండలోని కార్యాలయంలో శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికశాఖ సిబ్బంది జేసీఎల్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.



రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న శ్యాంసుందర్

పేషంట్ కేర్ ఉద్యోగిపై యూనియన్ లీడర్ దాడి

- ఎంజీఎం ఆస్పత్రిలో ఘటన
- మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

రామన్నపేట : ఎంజీఎం ఆస్పత్రిలో పేషంట్ కేర్ ఉద్యోగి సుమలతపై యూనియన్ లీడర్‌గా భావిస్తున్న రాజమ్మ సోమవారం దాడిచేసి తీవ్రంగా గాయపర్చడంతో రాజమ్మపై కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి ప్రాంగణంలో అందరు చూస్తుండగానే సుమలతను గొలుసుకు కట్టేసింది. ఉద్యోగం పెట్టించింది తానేనని రూ.లక్షకు పైగా డబ్బులు చెల్లించాలని దుర్భషలాడుతూ దౌర్జన్యానికి దిగింది. ఆమె సెల్ ఫోన్ సైతం పగులగొట్టి నానా హంగామా సృష్టించింది. దీంతో బాధితురాలు సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్ : ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై స్వీకరించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన 92 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓలు వెంకటేష్, నారాయణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వరంగల్ గ్రీవెన్స్‌లో 80 దరఖాస్తులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్: వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, డీఆర్డీఓ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డిలు ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 80 దరఖాస్తులు కాగా రెవెన్యూ శాఖ 34, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ 17, మిగతావి వివిధ శాఖలకు సంబంధించినవి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవన భృతి ఇవ్వడం లేదు..



మూడున్నరేళ్లుగా జీవన భృతి ఇవ్వకుండా నా కుమారుడు కరుణాకర్ ఇంటి నుంచి తరిమేశాడు. రూ.6 కోట్ల విలువైన ఆస్తులు ఇచ్చా. భర్త చనిపోయిన తర్వాత పోషించక పోవడంతో కోర్టు నెలకు రూ.3వేలు ఇవ్వాలని తీర్పు ఇచ్చింది. జూన్ 2021 వరకు బ్యాంకులో జమ చేసి అప్పటి నుంచి వేయడం లేదు. పలుమార్లు అడిగితే కొడుకు, కోడలు తిట్టి దాడి చేసి తరిమేశారు. అప్పటి నుంచి పెద్ద కూతురు వద్ద ఉంటున్న. నా కొడుకుకు ఇచ్చిన ఆస్తిని నాపేర రిజిస్ట్రేషన్ చేయించి న్యాయం చేయాలి.

– బుద్దెలక్ష్మి, వృద్ధురాలు, ఆరెపల్లి

నివాసితులకు నోటీసులు జారీ

హసన్‌పర్తి : చింతగట్టు క్యాంప్‌లో శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో నివాసం ఉంటున్న వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ఈఈ సీతారాం నాయక్ తెలిపారు. 'శిథిల భవనాల్లోనే నివాసం' అనే కథనం 'సాక్షి'లో సోమవారం ప్రచురితం కాగా, ఈఈ స్పందించారు. ఈమేరకు సమగ్ర నివేదిక అందజేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. క్యాంప్ ఆవరణలో ఉన్న భవనాలు..శిథిలావస్థకు చేరుకున్నవి..అందులో నివాసం ఉంటున్న కుటుంబాలు.. ఉద్యోగులకు కేటాయించిన.. అద్దెకు ఇచ్చిన భవనాలు, కార్యాలయాలు నిర్వహిస్తున్న భవనాల పరిస్థితిపై వివరాలు సమర్పించాలని సూచించారు. శిథిలావస్థ భవనాల్లో ఉన్నవారికి నోటీసులు జారీ చేసి భవనాలు ఖాళీ చేయించాలని ఆదేశించారు.

నకిలీ విలేకరుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న సత్యనారాయణరెడ్డి

వరంగల్ క్రైం: రిపోర్టర్ల పేరుతో టిప్పర్ డ్రైవర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేసిన నలుగురు నకిలీ రిపోర్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి వివరాలు వెల్లడించారు. న్యూ శాయంపేటకు చెందిన వంగ సాయికృష్ణ ఎంసీఏ చదివి హ్యాండ్ డిజిటల్ అనే బెంగళూరు సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం ద్వారా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతని ఎంసీఏ క్లాస్‌మెంట్ వరంగల్ కాపువాడకు చెందిన గుండాల గణేశ్, అతని స్నేహితులైన వరంగల్ కొత్తవాడకు చెందిన మహేశ్(ప్రైవేట్ ఉద్యోగి), సందీప్(సాఫ్ట్‌వేర్)లతో కలిసి ఆదివారం సాయంత్రం న్యూశాయింపేట శివారులోని రైల్వేట్రాక్ పక్కన మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అటువైపు వెళ్తున్న టిప్పర్ ఆపి డ్రైవర్‌తో మేము.. ప్రెస్ రిపోర్టర్లం, హ్యూమెన్ రైట్స్ అఫీసర్లమని చెబుతూ మీరు ఇంత రాత్రి ఏమి తీసుకుపోతున్నారంటూ బెదిరించారు. డ్రైవర్ జేబులోని రూ.400 బలవంతంగా లాక్కొని ఇంకా డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారు. డ్రైవర్ వద్ద ఫోన్‌ను లాక్కొని ఫోన్ పే లోంచి రూ.1,500 సాయికృష్ణకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా ఓనర్‌ను కూడా బెదిరిస్తే ఎక్కువ డబ్బులు ఇస్తారని భావించి టిప్పర్ డ్రైవర్‌ని అదే వాహనంలో ఎక్కించుకుని సాయి కృష్ణ టిప్పర్‌ని నడుపుకుంటూ వారి డంపింగ్ యార్డ్ వద్దకు వెళ్లి అక్కడ సూపర్‌వైజర్‌తో మేము రిపోర్టర్లం మీరు ఎలాంటి పర్మిషన్ లేకుండా నడుపుతున్నారు. మాకు డబ్బులు ఇవ్వాలని లేదంటే మిమ్మల్ని చంపుతామని బెదిరించారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పడంతో అతనితో తన ఓనర్ నెమరిగొమ్ముల సురేశ్‌రావుకి ఫోన్ చేయించి బెదిరింపులకు పాల్పడ్డారు. డబ్బులు ఇస్తే టిప్పర్లను వదిలిపెడతామని చెప్పారు. దీంతో యార్డ్ వద్దనే ఉండండి.. మేము డబ్బులు తీసుకుని వస్తామని చెప్పిన యజమాని మరికొంతమందిని వెంటబెట్టుకుని అక్కడకు రావడాన్ని గమనించిన నకిలీ రిపోర్టర్లు పారిపోయారు. గొమ్ముల సురేశ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సోమవారం మధ్యాహ్నం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి వెల్లడించారు.

వేదవిద్యార్థులకు ఇంగ్లిష్ విద్య అవసరం



మాట్లాడుతున్న డీసీ శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : వేద విద్యార్థులకు వేదవిద్యతోపాటుగా ఇంగ్లిష్ విద్య కూడా అవసరమని వరంగల్ దేవాదాయ ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు అన్నారు. సోమవారం వరంగల్ దేవాదాయ ధర్మాదాయశాఖ భవనంలో ఉన్న శ్రీభద్రకాళి సాంగ అగమ వేదపాఠశాల విద్యార్థులకు దాత విజయకుమార్, జానకి దంపతుల సౌజన్యంతో ఇంగ్లిష్ బోధించేందుకు ఉపాధ్యాయురాలిని నియమించారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు మాట్లాడుతూ వేదవిద్యార్థులు ఇతరదేశాల్లో పనిచేయాల్సి వచ్చినపుడు ఇబ్బంది పడకుండా వారికి ఆంగ్లవిద్య తెలిసి ఉండాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయురాలిని నియమించినట్లు తెలిపారు. అలాగే కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తామని అన్నారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత, భద్రకాళి దేవాలయం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, సూపరింటెండెంట్ గౌరిశంకర్ ఉన్నారు.

శిశువును అపహరించిన మహిళ అరెస్టు

24 గంటల్లో నిందితురాలిని ఆదిలాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామన్నపేట : ఆమె శిశువును దత్తత తీసుకోవాలనుకుంది.. కానీ కుదరలేదు. చివరికి ఎత్తుకెళ్లాలనుకుంది. శిశువును అపహరించి పోలీసులకు దొరికిపోయింది. వరంగల్ సీకేఎం ఆస్పత్రి నుంచి పసికందును అపహరించిన మహిళను ఇంతేజార్ గంజ్ పోలీసులు 24 గంటలలోపు అదుపులోకి తీసుకున్నారు. ఆమెనుంచి ఏడు నెలల మగశిశువును స్వాధీనం చేసుకుని సోమవారం రాత్రి వైద్యచికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ జిల్లా సార్కాని గ్రామానికి చెందిన జుగునకే సునీత నాలుగేళ్లుగా ఆదిలాబాద్ సుందరయ్యనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. భర్త సరిగా పట్టించుకోకపోవడంతో ఓ బాబుని దత్తత తీసుకోవాలని భావించింది. కానీ ఎలానో ఆమెకు తెలియలేదు. ఇక శిశువును అపహరించాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో పది రోజుల క్రితం కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రికి వెళ్లగా అక్కడ వీలు కాకపోవడంతో వారం రోజుల క్రితం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ గోండుతెగ వారు కనిపించగా వారి భాషలో మాట్లాడి భీమ్‌బాయ్ అనే మహిళను పరిచయం చేసుకుంది. తన భార్య ఏడు నెలలకే మగబాబుని ప్రసవించిందని, అలా పుట్టడడంతో బాక్స్‌లో పెట్టారని భీమ్‌బాయ్ భర్త సదరు మహిళకు చెప్పాడు. ఎలాగైనా ఆ బాలుడిని ఎత్తుకెళ్లాలని అనుకున్న సునీత.. పథకం ప్రకారం.. బాబుకు సీరియస్‌గా ఉందని చెప్పి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తామని ఆ ఆస్పత్రి వైద్యులను నమ్మించింది. వరంగల్‌లో చిన్న పిల్లలకు మెరుగైన చికిత్స అందిస్తారని తెలిపి ఎంజీఎంకు తీసుకువచ్చింది. శిశువు తల్లిదండ్రులను బయటనే ఉంచి పాపను సునీత పేరుతో అడ్మిట్ చేయించింది. తరువాత రోజు శిశువు తండ్రి మేము బాబును తీసుకెళ్తాం.. ఇక్కడ చికిత్స అవసరం లేదని అనగా, సదరు మహిళ తెలివిగా బాబు సీరియస్‌గా ఉందని మరోమారు తల్లిదండ్రులను, స్థానిక వైద్యులను నమ్మించి హైదరాబాద్‌కు తీసుకెళ్తామని చెప్పి సీకేఎం ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ కూడా తల్లిదండ్రులను బయట ఉండమని చెప్పి గుట్టుచప్పుడు కాకుండా శిశువును ఎత్తుకెళ్లింది. వరంగల్ రైల్వేస్టేషన్‌నుంచి నిజామాబాద్‌కు వెళ్లి అక్కడినుంచి తన సొంతూరు సార్కాని గ్రామానికి తీసుకెళ్లింది. సోమవారం ఉట్నూర్‌లో తన భర్త ఇంట్లో బట్టలు తీసుకెళ్లేందుకు ఆదిలాబాద్ బస్టాండ్‌కు రాగా పోలీసులు ఆ మహిళను పట్టుకుని వరంగల్‌కు తీసుకువచ్చి అరెస్టు చూపారు. 24 గంటల్లో కిలాడీ లేడీ అరెస్టు చేసిన ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐ వెంకన్న, ఉపేందర్, మహేందర్‌లను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



బాబును ఎంజీఎంలో అడ్మిట్ చేస్తున్న పోలీసులు